## క్లుప్తంగా

### బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ దశరథరామయ్య

మిడుతూరు: సచివాలయ ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందాలని ఎంపీడీఓ దశరథరామయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని 49–బన్నూరు, చౌట్కూరు, దేవనూరు గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి జియో టాగింగ్ కుటుంబ సర్వే ప్రగతిని పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టడంతోపాటు నీటి ట్యాంకులను శుభ్రపరచాలని చెప్పారు. సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ హాజరు పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సంజన్న, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

పాములపాడు: స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహం వద్ద కేజీ రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఆత్మకూరు మండలం కరివేన గ్రామానికి చెందిన లక్ష్మదేవి ఇతర కూలీలతో కలిసి ఆటోలో జూపాడుబంగ్లా మండలం మండ్లెం గ్రామానికి కూలి పనులకు వెళ్తున్నారు. ఆటోను ఓ లారీ ఓవర్ టేక్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆటోలో కుడి వైపు కూర్చున్న మహిళకు లారీ తగలడంతో కింద తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు తరలించారు. ఢీకొట్టిన లారీ డ్రైవర్ నిలపకుండా వెళ్లడంతో ఎస్‌ఐ సురేష్‌బాబుకు సమాచారం ఇచ్చారు. జూపాడుబంగ్లాలో పోలీసులు లారీని పట్టుకున్నారు. ఈ మేరు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### చట్టాలను అతిక్రమిస్తే రౌడీషీట్ ఓపెన్ చేస్తాం

పగిడ్యాల: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ చట్టాలను అతిక్రమిస్తే రౌడీషీట్ ఓపెన్ చేస్తామని ముచ్చుమర్రి ఎస్‌ఐ సి. శరత్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని బీరవోలులో ఎస్‌ఐ గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులు పిల్లల పెంపకం పట్ల జాగ్రత్త వహించాలని, వారికి మంచి విద్యను అందించేందుకు పాటుపడాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నత విద్యావంతులై తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. ఆడపిల్లలపట్ల అమర్యాదగా ప్రవర్తిస్తే పోక్సో, నిర్భయ చట్టం కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

### అపార్ నమోదు వేగవంతం చేయండి

జూపాడుబంగ్లా: అపార్ (ఆటోమెటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిష్టర్) నమోదు ప్రక్రియను ప్రధానోపాధ్యాయులు వేగవంతం చేయాలని మండల విద్యాధికారి–1 చిన్నమద్దిలేటి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా ఒకటి నుంచి పది వరకు 4,653 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో జూపాడుబంగ్లా మండలం వెనుకబడి ఉన్నందున సత్వరమే ప్రధానోపాధ్యాయులు అపార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంఈఓ చిన్నమద్దిలేటి కోరారు.

### స్టడీ అవర్స్ నిర్వహించంచాలి

జూపాడుబంగ్లా: త్వరలో వార్షిక పరీక్షలు జరగనున్న నేపథ్యంతో పదోతరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో స్టడీ అవర్స్ నిర్వహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. మండలంలోని తరిగోపుల, మండ్లెం, కనకయ్యకొట్టాల, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలతోపాటు జూపాడుబంగ్లాలో ప్రభుత్వ ఉన్నత, మోడల్‌స్కూళ్లు ఉన్నాయి. వీటిల్లో సుమారు 450మంది విద్యార్థులు పదోతరగతి విద్యను అభ్యసిస్తున్నారు. మరో నాలుగు మాసాల్లో పదోతరగతి వార్షిక పరీక్షలు జరగనున్న నేపథ్యంలో వెనుకబడి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలంటే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకొని స్టడీ అవర్స్ నిర్వహించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

### 14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

బండి ఆత్మకూరు: జాతీయ గ్రంథాలయ ఉత్సవాలు ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు స్థానిక బండి ఆత్మకూరు గ్రంథాలయంలో నిర్వహిస్తున్నామని గ్రంథాలయ అధికారి మధు తెలిపారు. ఈ సందర్భంగా మండల విద్యా శాఖాధికారి జి.మోహన్‌రెడ్డి వారోత్సవాల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14వ తేదీన బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాస రచన పోటీలు, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమ నాయకుల స్మరణ, 17న కవుల సమ్మేళనం, 18న విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా 19న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆటల పోటీలు, 20న పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

# జ్వాలాతోరణం.. సర్వపాపహరణం

- ఈ నెల 15న శ్రీశైలంలో కార్తీకపౌర్ణమి ఉత్సవాలు
- ఏర్పాట్లు చేస్తున్న దేవస్థాన అధికారులు

శ్రీశైలంటెంపుల్: కార్తీకమాసంలో పౌర్ణమికి ప్రత్యేకత ఉంది. ఆ రోజున శ్రీశైల దేవస్థానంలో దేదీప్యమానంగా జ్వాలాతోరణోత్సవం నిర్వహిస్తారు. అలాగే పాతాళగంగ వద్ద కృష్ణమ్మకు శాస్త్రోక్తంగా పుణ్యనది హారతి ఇస్తారు. ఆయా కార్యక్రమాల కోసం దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది.

**జ్వాలాతోరణోత్సవం**

శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 15న శుక్రవారం కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని సాయంత్రం శ్రీశైల ఆలయం ఎదురుగా గంగాధర మండపం వద్ద జ్వాలాతోరణోత్సవం నిర్వహిస్తారు. అధికసంఖ్యలో భక్తులు జ్వాలాతోరణోత్సవాన్ని దర్శించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. నేతితో తడిపిన నూలు ఒత్తులను వత్తులను తోరణంగా ఏర్పాటు చేసి వెలిగిస్తారు. ఈ భస్మాన్ని నుదుట రాసుకోవడం వల్ల ఆయుష్షు, ఐశ్వర్యం లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి జ్వాలాతోరణం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేస్తారు.

**శివపార్వతులతో ముడిపడిన పురాణగాథ**

పూర్వం కృతయుగంలో అమృతం కోసం దేవదానవులు కలిసి క్షీరసాగరాన్ని మథించారు. అందుకు భూమి మధ్యలో ఉన్న మంధర పర్వతాన్ని కవ్వంగా, వాసుకీ సర్పాన్ని తాడుగా చేసుకున్నారు. పర్వతాన్ని సముద్రంలోకి దించగానే అది పట్టు తప్పి పడిపోవడంతో శ్రీమహావిష్ణువు కూర్మావతారం ధరించి సాగరం అడుగుకు వెళ్లి తన వీపుపై పర్వతాన్ని ఎత్తగా దేవతలు, రాక్షసులు క్షీరసాగరాన్ని మథించడం ప్రారంభించారు. అందులోనుంచి మొదట హాలాహలం జనించడంతో సకల లోకాలనూ దహించివేయగల కాలకూట విషమైన హాలహలాన్ని పరమశివుడు లోకహితం కోసం సేవించి కంఠంలో ఉంచుకోవడంతో శివుడికంఠం నీలంగా మారింది. దీన్ని చూసి భయాందోళనకు గురైన పార్వతీదేవి తన భర్తకు ఏ కీడు తగలకుండా ఈ ఆపద నుంచి బయటపడితే.. తాను భర్తతో పాటు చిచ్చుల తోరణం కింద మూడుసార్లు నడిచి వస్తానని అనుకుందట. తర్వాత శివుడికి ఎలాంటి ఆపద కలగకపోవడంతో పార్వతీదేవి శివుడితో కలిసి కార్తీక పౌర్ణమి నాడు జ్వాలాతోరణం కింద మూడుసార్లు నడిచినట్లు అప్పటి నుంచి జ్వాలాతోరణోత్సవం ప్రారంభమైనట్లు పురాణ గాథ.



శ్రీశైల దేవస్థానంలో జ్వాలాతోరణోత్సవం (ఫైల్)

**పుణ్యనదీహారతి**

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని పాతాళగంగ వద్ద ఉన్న కృష్ణమ్మ తల్లి విగ్రహానికి సాయంత్రం పుణ్యనదీహారతి కార్యక్రమం నిర్వహిస్తారు. పాతాళగంగ స్నానఘాట్ల వద్ద కృష్ణ నదీమతల్లికి విశేషపూజలు, సారె సమర్పణ, నీరాజనం కార్యక్రమాలతో పాటు పుణ్యనదికి నవహారతులు ఇస్తారు.

**విస్తృత ఏర్పాట్లు చేస్తున్న దేవస్థానం**

జ్వాలాతోరణోత్సవానికి ఆలయం ఎదురుగా గంగాధర మండపం వద్ద ఏర్పాట్లు మొదలయ్యాయి. అలాగే పాతాళగంగ వద్ద కృష్ణమ్మకు పుణ్యనదీహారతి ఇచ్చేందుకు ఆయా ఏర్పాట్లు చేస్తున్నారు. జ్వాలాతోరణోత్సవాన్ని భక్తులు అధికసంఖ్యలో వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

### సంగమేశ్వరం ఎగువ పుష్కర ఘాట్‌లో భక్తుల పూజలు

కొత్తపల్లి: సప్తనదులసంగమేశ్వరంలో కార్తీకమాసాన్ని పురష్కరించుకొని భక్తులు మంగళవారం పుణ్య స్నానాలు ఆచరించి గంగమ్మకు హారతులు పట్టారు. అనంతరం సంగమేశ్వరం ఎగువ పుష్కర ఘాట్‌లోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకొన్నారు. అనంతరం స్వామి,అమ్మవార్ల ఎదుట కార్తీకజ్యోతులు వెలిగించి విశేషపూజలు నిర్వహించారు. అర్చకులు తెలకపల్లి రఘురామశర్మ భక్తులతో పుష్పార్చన, కుంకుమార్చన వంటిపూజలు నిర్వహింపజేసి మహామంగళహారతులిచ్చి ఆశీర్వదించారు.

### కుమారస్వామికి విశేషపూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమార స్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు.

## అధికారుల సలహాలు పాటించాలి



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి

ఆత్మకూరు: రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. మంగళవారం కురుకుంద, కొట్టాల చెరువు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రబీలో రైతులు సాగుచేసిన మినుము, వరి, శనగ, జొన్న, వేరుశనగ, ఉల్లి పంటలకు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలని సూచించారు. సబ్సిడీ కింద మినుము విత్తనాలు కావాల్సిన రైతులు రైతుసేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమ శాఖ అధికారి అరుణ, ఏఈఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

### సన్మానం



దస్తగిరిరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: నంద్యాల గురురాజ విద్యాసంస్థ షేక్షావలిరెడ్డి ఆధ్వర్యంలో గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ అధినేత దస్తగిరిరెడ్డిని మంగళవారం సన్మానించారు. ఇండియ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతిష్టాత్మక పురస్కారం అందుకున్న సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు పుల్లయ్య సమక్షంలో దస్తగిరిరెడ్డిని సత్కరించారు.

### రేపు జీపీడీపీపై శిక్షణ

పగిడ్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై(జీపీడీపీ) ఒక్క రోజు శిక్షణా కార్యక్ర మం ఉంటుందని ఎంపీడీఓ సుమిత్రమ్మ మంగళ వారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. అధికారులతోపాటు సర్పంచ్‌లు, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు తప్పనిస రిగా హాజరై విజయంతం చేయాలని ఎంపీడీఓ కోరారు.

మిడుతూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై (2025–2026 బుధవారం శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దశరథరామయ్య తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

## హామీలు అమలు చేయాలి



యాత్ర నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్, నాయకులు రామ్‌నాయక్, షేక్‌ఇస్మాయిల్, సద్దాంహుసేన్ డిమాండ్‌చేశారు. పట్టణంలోని సంగమేశ్వర సర్కిల్‌లో మంగళవారం రెండోరోజూ ప్రజాపోరు యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేల చొప్పున ఇవ్వాలని, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇవ్వాలని కోరారు. వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, తల్లికి వందనం, నిరుద్యోగభృతి లాంటి హామీలన్నీ నెరవేర్చి మాట నిలబెట్టుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 14న తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్న ధర్నాకు అన్ని వర్గాల ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ప్రజాపోరు యాత్ర సంగమేశ్వర సర్కిల్ నుంచి వెంగళరెడ్డినగర్, అర్బన్ కాలనీ, వీరభద్ర ఏరియా, పాత బస్టాండు వరకు సాగింది. కార్యక్రమంలో పార్టీ నాయకులు షఫీవుల్లా, కిరణ్, మహమ్మద్, బాలశివుడు, సామేల్ పాల్గొన్నారు.

### హెచ్‌ఐవీపై విద్యార్థులకు అవగాహన

శ్రీశైలంప్రాజెక్ట్: హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌కు మందు లేదని నివారణ ఒక్కటే మార్గమని ఎస్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్.వి.అబూబకర్ అన్నారు. మంగళవారం శ్రీశైలంప్రాజెక్ట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెరిబా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అబూబకర్ మాట్లాడుతూ యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని,హెచ్‌ఐవీ, ఎయిడ్స్ పట్ల స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రాణాంతకమైన ఎయిడ్స్ మహమ్మారిని నిర్మూలించే దిశగా యువత అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె.సూర్యనారాయణ, మెరిబా సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ జుల్ఫికర్ ఆలీఖాన్, సభ్యులు దమయంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

### మహానందిలో కార్తీక పూజలు



మహానందీశుడి దంపతులు



కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మహానంది: మహానందిలో మంగళవారం కార్తీకమాసం, ఏకాదశిలను పురస్కరించుకుని భక్తులు పూజ లు నిర్వహించుకున్నారు. గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు స్థానిక యాగశాలలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, ఆంజనేయశర్మ, హను మంతశర్మలు ఉదయం స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవం కనులపండువగా చేపట్టారు. భక్తులు ఆలయ ప్రాంగణాల్లోని నందిస్తూపం, ధ్వజస్తంభం, నాగులకట్ట ప్రాంగణాల్లో కార్తీకదీపాలు వెలిగించిన అనంతరం స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు.

**మహానందీశ్వరుడి సన్నిధిలో విద్యుత్ శాఖ ఎస్‌ఈ**

జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఈ సుధాకర్‌కుమార్ సతీసమేతంగా మంగళవారం రాత్రి మహానందికి వచ్చారు. మండల అసిస్టెంట్ ఇంజినీర్ ప్రభాకర్ రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు వారికి స్వాగతం పలికారు. కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. అనంతరం స్థానిక అలంకార మండపంలో వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు.

## చదువురాని మహిళలను గుర్తించాలి



శిక్షణలో మాట్లాడుతున్న ఏడీ వెంకటేశ్వర్లు

వెలుగోడు: గ్రామాల్లో ప్రతి పొదుపు గ్రూపులో చదువురాని మహిళలను గుర్తించాలని ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం స్త్రీ శక్తి భవన్‌లో వయోజన విద్య ఆధ్వర్యంలో అందరికి జీవిత కాల అభ్యాసం శిక్షణా కార్యక్రమంలో పాల్గొని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల చదువుతోనే సామాజిక అభివృద్ధి సాధ్యమన్నారు. పొదుపు గ్రూపులో చదువుకున్న వారిని వలంటీర్లుగా ఏర్పాటు చేసి ఒక్కొక్కరు 10 మందికి చదువు నేర్పించేలా చేయడమే ఉల్లాస్ ఉద్దేశమన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేసి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, ఏపీఎం షకూర్, సీసీలు సుగుణపాల్, శివమ్మ, జ్యోతి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

### 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పాములపాడు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20వతేదీ వరకు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ శాఖాధికారి కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 14వ తేదీ బాలల దినోత్సవం సందర్భంగా తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమకారులు డాక్టర్ అయ్యంకి రమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్, గాడిచెర్ల హరిసర్వోత్తమరావును స్మరించుకుని నివాళులర్పిస్తామన్నారు. అదేవిధంగా 17, 18 తేదీల్లో విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, ఆటల పోటీలు ఉంటాయన్నారు. 19న తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు, 20వ తేదీ ముగింపు సందర్భంగా విజేత విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తామని వివరించారు.

### అందుబాటులో మినుములు

పాములపాడు: మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో మినుములు అందుబాటులో ఉన్నాయని ఏఓ ఫణీశ్వరరెడ్డి తెలిపారు. వీబీఎన్–8 రకం విత్తనాలు ఉన్నాయన్నారు. విత్తనాలు కావాల్సి రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, ఫోన్‌నెంబరుతో రైతు సేవా కేంద్రంలో రిజిష్టర్ చేసుకోవాలని సూచించారు. నాలుగు కేజీల మినుము విత్తనాల ప్యాకెట్‌కు రూ.400 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

### ప్రతిఒక్కరికీ చదువు నేర్పండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి భాస్కర్‌రెడ్డి

ఆత్మకూరు: పొదుపు మహిళలు ప్రతి నిరక్ష్యరాస్యులైన ప్రతిఒక్కరికీ చదువు నేర్పించాలని వయోజన విద్య జిల్లా నోడల్ అధికారి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు మహిళలు కొందరు నిరక్షరాస్యులుగా ఉన్నారన్నారు. వారికి అక్షరాస్యత కల్పిస్తే సామాజిక, ఆర్థిక విషయాల్లో అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శెట్టి, ఎంఈఓ బాలాజీనాయక్, ఏపీఎం ఉమాదేవి, వెలుగు సీసీలు, వలంటీర్లు, బుక్ కీపర్లు తదితరులు పాల్గొన్నారు.

### సర్వే త్వరగా పూర్తి చేయండి

వెలుగోడు: సచివాలయ సిబ్బంది చేపట్టిన ఇంటింటి సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జియో ట్యాగింగ్‌లో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. లబ్ధిదారులు అకౌంట్ నెంబరుకు ఎన్‌పీసీఐ లింక్ చేయించాలన్నారు.

### కాంగ్రెస్ పార్టీ శ్రీశైలం సమన్వయకర్తగా ఇస్మాయిల్

శ్రీశైలంప్రాజెక్ట్: కాంగ్రెస్ పార్టీ శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్తగా రెండోసారి సున్నిపెంట గ్రామానికి చెందిన ఏఎస్ ఇస్మాయిల్ ఎన్నికయ్యారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సమన్వయకర్తల జాబితాను మంగళవారం విడుదల చేసినట్లు ఇస్మాయిల్ తెలిపారు. రెండో సారి తనకు సముచిత స్థానం కల్పించిన షర్మిలకు, రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఇస్మాయిల్ పేర్కొన్నారు.

## సస్యరక్షణ చర్యలు చేపట్టండి



మాట్లాడుతున్న సైంటిస్టు రామకృష్ణారావు

జూపాడుబంగ్లా: సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం వలను చీడపీడల నుంచి పంటలను రక్షించుకోవటంతో పాటు అధికదిగుబడులు సాధించుకొనే అవకాశం ఉంటుందని ఆర్ఏఆర్ఎస్ నంద్యాల ప్రిన్సిపాల్ సైంటిస్టు డాక్టర్ రామకృష్ణారావు రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని పారుమంచాలలో సాగు చేసిన మిరప, మినుము, కందిపంటలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయా పంటల్లో వ్యాపించే చీడపీడలు వాటి నివారణపై అవగాహన కల్పించారు. కంది, మినుము పంటల్లో మరుక మచ్చల పురుగు, కాయతొలచు పురుగు, కాయ ఈగ వ్యాపించి పంటనష్టం కలిగించే అవకాశాలున్నాయన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి, ఏఈఓ శేఖర్, రైతు సేవాకేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## రబీ పంటలకు బీమా చేయించుకోండి



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ ఆంజనేయ

కొత్తపల్లి: రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలకు రైతులు ప్రీమియం చెల్లించి తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ తెలిపారు. మంగళవారం మండలంలోని గుమ్మడాపురం గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ పంటలకు బీమా వలన ప్రకృతివైపరీత్యాలు సంభవించి పంటనష్టం వాటిల్లితే సులభంగా పంట నష్టపరిహారం పొందవచ్చునన్నారు. బ్యాంకుల్లో పంటరుణాలు తీసుకోని రైతులు, కౌలురైతులు రైతుసేవా కేంద్రాల్లో ప్రీమియం చెల్లించి బీమా పొందవచ్చునన్నారు. డిశంబర్ 15లోగా పంటలబీమా చేయించుకోవాలని సూచించారు. రైతుసేవా కేంద్రాల్లో మినుము వీబీఎన్–8 రకం మినుము విత్తనాలు 33శాతం రాయితీపై ఇస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## జియో ట్యాగింగ్ సర్వే పకడ్బందీగా చేపట్టాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుమిత్రమ్మ

పగిడ్యాల: హౌస్‌హోల్డ్ జీయో ట్యాగింగ్ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని సచివాలయ ఉద్యోగులను ఎంపీడీఓ సుమిత్రమ్మ ఆదేశించారు. మంగళవారం నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను ఎంపీడీఓ పర్యవేక్షించారు. సర్వేలో పొందుపరిచిన వివరాలను కుటుంబ యజమాని నుంచి రాబట్టి ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అనంతరం ఆ యజమాని ఆధార్ అథెంటికేషన్ తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఈనెల 15వ తేదీలోగా జీయో ట్యాగింగ్ సర్వే పూర్తి చేయాలన్నారు. అనంతరం కొత్త ముచ్చుమర్రి గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ కార్యదర్శులు కాసీంసాహెబ్, వీరన్నయాదవ్, తదితరులు ఉన్నారు.

### ఎక్సైజ్ అధికారుల మెరుపుదాడులు

బండి ఆత్మకూరు: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం మెరుపుదాడులు నిర్వహించి అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి తెలిపారు. పక్కా సమాచారంతో తమ సిబ్బంది, ఈఎస్‌టీఎఫ్ స్క్వాడ్ నిర్వహించిన దాడుల్లో సంతజూటూరు గ్రామానికి చెందిన వెంకటరాముడు నుంచి 23 (180 ఎంఎల్), ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన బెల్లం సారాంబీ నుంచి 32 (180 ఎంఎల్), ఎ.కోడూరు గ్రామానికి చెందిన మాడుగుల సల్మాన్ రాజు నుంచి 30 (180 ఎంఎల్) బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

- మహానంది: గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహించినా, నాటుసారా బట్టీలు పెట్టినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి, ఎస్‌ఐ బ్రహ్మయ్య హెచ్చరించారు. మంగళవారం రాత్రి వారు మాట్లాడుతూ మద్యం షాపుల పరిసరాల్లో తనిఖీలు నిర్వహించి బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వారిపైనా, దుకాణ నిర్వాహకులపైనా చర్యలు తీసుకుంటామన్నారు.
- మహానంది: ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి మంగళవారం రాత్రి సీతారామపురం గ్రామంలో పర్యటించారు. ప్రశాంతంగా జీవనం సాగించాలని గ్రామస్తులకు ఆయన సూచించారు.